క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట పూజలు



కలశాల ఊరేగింపులో భక్తులు

నందికొట్కూరు: పట్టణంలోని కోట వీరభద్ర స్వామి ఆలయ ప్రతిష్ట పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుంకులమ్మ గుడి వద్ద నుంచి స్వామి వారి విగ్రహాలను, కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితల మంత్రోర్చనలతో విగ్రహ ప్రతిష్ట పూజలు కొనసాగాయి.

నేడు జంబులాదేవి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని జంబులాదేవి ఆలయంలో శనివారం బారసాల పౌర్ణమి సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు బోనాలతో భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

మహానంది: సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు రాగాల వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ దివ్య

పగిద్యాల: క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదనరావు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



బొల్లవరంలో బోర్‌కు మరమ్మతులు చేయించిన దృశ్యం

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బొల్లవరం గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం గ్రామంలోని రెండు బోర్లను అందుబాటులోకి తీసుకువచ్చి ఆయా కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి సహకారంతో బోర్లకు మరమ్మతులు చేయించినట్లు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధురి, ఈఓఆర్డీ సంజన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని జరిపారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

శ్రీశైలం సన్నిధిలో పీఠాధిపతులు

శ్రీశైలం టెంపుల్: కంచి కామ కోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ మహాస్వామి శుక్రవారం హటకేశ్వరాలయాన్ని, పాలధార – పంచధార వద్ద శారదా చంద్రమౌళీశ్వరుల ఆలయాన్ని సందర్శించి పూజాధికాలు జరిపించుకున్నారు. వీరి వెంట కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, వేదపండితులు, అర్చకస్వాములు, సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు ఉన్నారు.

గ్రామాల చెంతకే వైద్య సేవలు



నందికుంటలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



జలకనూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల చెంతకే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచు నిత్యలక్ష్మీదేవి, వైద్యురాలు దీపానాగవేణి అన్నారు. శుక్రవారం మండలంలోని నందికుంట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద రెండవ విడత ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. 402 మందికి రక్త, బీపీ, షుగర్, గుండెపనితీరు, కంటి చూపు తదితర పరీక్షలు నిర్వహించారు. ఇద్దరిని శస్త్ర చికిత్సల నిమిత్తం జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మహమ్మద్ భేగ్, విజయేంద్ర, సీహెచ్‌ఓ బాలకృష్ణయ్య, కంటివైద్య నిపుణులు షేక్షావలి, ఎంపీటీసీ సభ్యుడు బాలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ నారాయణ ఆచారి, వైద్య, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

● మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని డాక్టర్ కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జలకనూరు గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి కొన్ని కేసులను హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి, నాయకులు రవికుమార్, మల్లు రామలింగేశ్వరరెడ్డి, డాక్టర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మహానంది: మహానంది గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ మాజీ సర్పంచ్ రాగుల నాగులు, నాసరి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, గోవిందుగౌడ్, అయ్యన్ననగర్ రాజు, ఈశ్వరయ్య, గంగాధర్, రమేష్‌తో పాటు 100 కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మ మహేశ్వర్ రెడ్డి, మహానంది నాయకులు భూమా సుబ్బరామయ్య, గంగిశెట్టి మల్లికార్జున, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణనంది ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని నవ నందుల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కృష్ణనంది ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పాల కమండలి చైర్మన్ పల్లె తిరుపం రెడ్డి అన్నారు. కృష్ణ నంది ఆలయంలో శుక్రవారం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులుగా అంబటి రామలక్ష్మమ్మ, కొప్పుల నాగమణి, మాధవి, నీలావతి, రవికుమార్, నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంగళరెడ్డిపేట సర్పంచ్ పల్లె నాగమణి, నాయకులు సోమశేఖర్ రెడ్డి, ఆదిలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

సంతాపం

మహానంది: వైద్య వృత్తిలో పేదలకు సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందిన డాక్టర్ చంద్రశేఖర్ మృతి బాధాకరమని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్ దాస్, డాక్టర్ శాంతి ప్రియ అన్నారు. తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం డాక్టర్ చంద్రశేఖర్ మృతి పట్ల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ హుస్సేన్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆలయంలోని అలంకార మండపంలో ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఆహ్వాన పత్రికలను నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి తదితరులకు అధికారులు అందించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

రేపు కంచి కామకోటి పీఠాధిపతి రాక



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

మహానంది: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ఈనెల 25న మహానంది రానున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. శుక్రవారం వారు ఆలయంలో పీఠాధిపతి పర్యటన, పూజలకు అవసరమైన ఏర్పాట్ల పనులను పర్యవేక్షించి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25, 26వ తేదీలలో మహానందిలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన



ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా శుక్రవారం నంద్యాల శ్రీ సాయి నృత్య కళాశాల వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై డాక్టర్ శ్యామల సదాశివుడు, వైష్ణవి, గాయత్రి, లక్ష్మిప్రసన్న తదితరులు గణపతి కౌత్వం, మూషికవాహన, శివ శంకర, పుష్పాంజలి, భో.. శంభో, శివపంచాక్షరీ స్తోత్రం భక్తి గీతాలకు నృత్యం చేశారు.

మామపై అల్లుడి దాడి

మహానంది: కుమార్తెను పుట్టినింటికి పంపాలని అడిగిన మామపై అల్లుడు, కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన గాజులపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. గాజులపల్లె గ్రామానికి చెందిన హుసేన్ కుమార్తె వైశాలిని అదే గ్రామానికి చెందిన నాగమద్దిలేటికి ఇచ్చి వివాహం చేశారు. వైశాలి ప్రస్తుతం ఐదో నెల గర్భిణి. సంప్రదాయం ప్రకారం ఆమెను పుట్టినింటికి తీసుకెళ్లేందుకు తండ్రి అల్లుడి ఇంటికి వచ్చి అదే విషయాన్ని ప్రస్తావించాడు. కాగా అంతకుముందే ఉన్న మనస్పర్థల కారణంగా మామపై అల్లుడు నాగమద్దిలేటి, కుటుంబ సభ్యులు మౌలాలమ్మ తదితరులు దాడికి పాల్పడ్డారు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష కుంకుమార్చన



లక్ష కుంకమార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, తదితర ప్రాంతాల నుంచి మొత్తం 37 మంది భక్తులు పరోక్షసేవగా కుంకుమార్చనను జరిపించుకున్నారు. ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చన జరిపించారు. మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ కుంకుమ ద్రవ్యంతో అమ్మవారికి అర్పించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆత్మకూరు: శిరీషాబాయి మృతికి కారకులైన భర్త, అత్త, మామ, మరిదిలను కఠినంగా శిక్షించాలని ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహానాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూరు మండలంలోని ఎస్‌ఎన్ తండాకు చెందిన బాలాజీ నాయక్, రత్నబాయి దంపతుల కుమార్తె శిరీషాబాయిని గర్భిణి అనే కనికరం లేకుండా వరకట్న వేధింపులకు పాల్పడి, చివరకు హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించడం దారుణమన్నారు. నిందితులు భర్త శ్రీకాంత్‌నాయక్, మామ తిరుపాల్‌నాయక్, అత్త రుక్మిణీ బాయి, మరిది పురేంద్రనాయక్‌లను చట్టపరంగా శిక్షించాలన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించండి



నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు



నందికొట్కూర్‌లో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆత్మకూరు: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ పట్టణ, మండల అధ్యక్షుడు రజాక్, రాంనాయక్‌లు అన్నారు. హర్యానా ఘటనను నిరసిస్తూ శుక్రవారం కొత్త బస్టాండ్ ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ధర్నా చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు విరుచుకుపడటం తగదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రైతులపై హర్యానా పోలీసులు కాల్పులు జరపడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి అన్నారు. శుక్రవారం పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని రఘురామమూర్తి డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని ఆందోళనలు చేపడితే కాల్పులు జరుపుతారా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం స్పందించి మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసులు, రాముడు, నాగరాజు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీల ధ్వంసం



పట్టుబడిన నాటుసారాను చూపుతున్న పోలీసులు

కొత్తపల్లి: నాటుసారా బట్టీలను శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్ తన సిబ్బందితో కలిసి మండలంలోని వీరాపురం గ్రామ సమీప నల్లమల అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించారు. సోలార్‌కుంట పరిసర ప్రాంతంలో 5,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. సోదాల్లో సిబ్బంది ప్రసాద్‌నాయక్, హరినాథ్ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

● వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర దార సుధీర్



స్థానికుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ సూచించారు. శుక్రవారం స్థానిక 27వ వార్డులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డితో కలిసి కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను వివరించాలన్నారు. చంద్రబాబు గతంలో చేసిన మోసాలను గుర్తు చేసి, జగనన్న ప్రభుత్వం వల్ల మేలు జరిగి ఉంటేనే ఓటు వేయాలని ప్రజలను కోరాలన్నారు. వార్డులో సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు, పైపులైన్ నిర్మాణలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి ఓటు అడగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చాంద్‌బాషా, అశోక్, లాలు, రవూఫ్, చిన్నరాజు, సురేష్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్‌బేగ్, సులోచనమ్మ, అబుబక్కర్, పట్టణ అధ్యక్షులు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కవిరాజు

పగిద్యాల: బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కవిరాజు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తహీనత, హై రిస్క్ ప్రెగ్నెన్సీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేయడం వల్ల భవిష్యత్‌లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. 18 ఏళ్లు నిండిన అనంతరమే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రక్తహీనత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ మహిళల గుర్తింపులో అలసత్వం వద్దని ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. అనంతరం వైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ రెండు విడుతలుగా మండల వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను నిర్వహించి వేలాది మంది రోగులకు వైద్యం అందించామన్నారు. అత్యవసర చికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేసి, వారి ఆరోగ్య స్థితిగతులపై మానటరింగ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామగురప్ప, హెల్త్ సూపర్‌వైజర్ శివగౌరీ ఉన్నారు.

క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయండి

● శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
● ఇండోర్ స్టేడియాలకు కోచ్‌లు నియామకం



స్థానిక ఇండోర్ స్టేడియం కోచ్ శాంతరాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోచ్‌లకు సూచించారు. నందికొట్కూర్, పగిద్యాల ఇండోర్ స్టేడియాలకు పెరుమాళ్ల శాంతరాజు, విక్రమ్‌లను కోచ్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారికి శుక్రవారం బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, దేశ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తయారు చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆడుదాం.. ఆంధ్ర క్రీడల ద్వారా క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి ఆర్థిక సాయంతో ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సిద్ధార్థరెడ్డికి కోచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాప్ జిల్లా కోఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముసలిమడుగు మాబాషా పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

నందికొట్కూరు: స్థానిక జైకిసాన్ పార్కులో శనివారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ లింగాల స్వాములు మాదిగ కోరారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, మాదిగల సమాన వాటా, మాదిగలపై రాజకీయ పార్టీలు చూపుతున్న వివక్షతపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తీరిన తాగునీటి సమస్య

● ఏళ్లుగా ఇబ్బంది పడిన కాలనీ వాసులు
● గడప గడపలో సమస్య ఎమ్మెల్యే దృష్టికి
● పైప్‌లైన్ నిర్మాణంతో తొలగిన ఇబ్బంది



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్ జయపాల్

వెలుగోడు: పదిహేనేళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరిష్కారం చూపారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించి పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వెలుగోడు పట్టణంలోని మంచినీళ్ల బావి దర్గా సందులో సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 15 ఏళ్ల నుంచి వీరికి తాగడానికి నీళ్లు లేక ఎంతో అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు రాజకీయ నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికలు వస్తే తప్ప ఎవరూ ఆ సందును తొంగి చూసేవారు కాదు. ఆ సమయంలో జగనన్న ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కాలనీలో పర్యటిస్తుండగా స్థానికులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శిల్పా చక్రపాణి రెడ్డి ఎంపీపీ నిధులతో పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పైప్ లైన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్‌కు దర్గా ఏరియా వాసులు కతజ్ఞతలు తెలిపారు.